# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 151 క్రిష్ణా, బుధవారం 25- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## శ్రీకాకుళంలో డయేరియా అంశంపై సీఎం చంద్రబాబు సమీక్ష..




క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 24: శ్రీకాకుళంలో కలకలం సృష్టిస్తున్న డయేరియా అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ విషయంపై జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. డయేరియా బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆదేశించారు. మంగళవారం ఈ ఘటనపై వేర్వేరుగా రెండుసార్లు జిల్లా అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో అందుతున్న వైద్యంపై ఆరా తీశారు.శ్రీకాకుళం నగరంలో రోడ్డు మరమ్మతుల పనుల కారణంగా డయేరియా వ్యాపించిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఘటనలో మొత్తం 65 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పారు. చికిత్స పొందుతున్న వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని, ప్రస్తుతం వారికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారు.. మీకూ భాగస్వామ్యముందా?:




క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 24: ఏపీ అసెంబ్లీలో తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి వినియోగించిన కల్తీ నెయ్యిపై లఘు చర్చ కొనసాగుతోంది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సభలో మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యి ఉపయోగించలేదని ఇప్పటికే తేలిపోయిందన్నారు. నెయ్యిలో రసాయనాలు కలవలేదని వైసీపీ అబద్ధాలు చెబుతోందని.. అందుకే తాము వివరణ ఇవ్వాల్సి వచ్చిందని పవన్ తెలిపారు. కల్తీ నెయ్యి తయారీలోనూ సృజనాత్మకత చూపించారని.. నెయ్యి కావాలంటే పాల నుంచే కాదు రసాయనాల నుంచీ తయారు చేయొచ్చని నిరూపించారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వాధినేత తప్పుచేశారని తానెక్కడా చెప్పలేదని.. అప్పటి టీటీడీ పాలకమండలి తన బాధ్యత నిర్వహణలో విఫలమైందని విమర్శించారు. తాము ఏ ఒక్కరిపైనా ఆరోపణలు చేయడం లేదని.. జగన్ నియమించిన బోర్డు హయాంలోనే తప్పు జరిగిందని డిప్యూటీ సీఎం అన్నారు. నాటి టీటీడీ బోర్డు సభ్యులను మాజీ సీఎం జగన్ ఎందుకు వెనకేసుకొస్తున్నారని ప్రశ్నించారు. 'దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవచ్చని జగన్ చెబితే సరిపోయేది.. వెనకేసుకొస్తున్నారంటే మీకూ భాగస్వామ్యం ఉన్నట్టే కదా?' అని అనుమానం వ్యక్తం చేశారు పవన్. అసలు నెయ్యిలో రసాయనాలు కలవలేదని వైసీపీ నేతలు చెప్పడమేంటని నిలదీశారు. ప్రసాదాన్ని అపవిత్రం చేసేందుకు కుట్ర జరిగిందని సిట్ తేల్చిందని చెప్పారు. నచ్చినవారికి కాంట్రాక్టులు ఇచ్చుకునేందుకు నిబంధనలు సడలించారని పవన్ ఆరోపించారు. రూ.20 కోట్ల లడ్డూలు రసాయనాల నెయ్యితో తయారైనట్టు తేలిందని, రసాయనాలతో తయారైన లక్ష లడ్డూలను అయోధ్యకు పంపారని ఈ సందర్భంగా పవన్ తెలిపారు. కల్తీ నెయ్యి కేసులో దోషులెవరైనా శిక్ష పడాల్సిందేనని స్పష్టం చేశారాయన. ఆ నెయ్యిలో.. ఏ రసాయనాలు ఉన్నాయో శ్రీవారికే తెలియాలన్నారు డిప్యూటీ సీఎం. నెయ్యిలో జంతు సంబంధ రసాయనాలు ఉన్నాయని ఎన్‌డీడీబీ రిపోర్టు ఇచ్చిందని.. అది అసలు నెయ్యే కాదని సీబీఐ సిట్ రిపోర్ట్ ఇచ్చిందని తెలిపారు. ఇది స్వామివారికి కాకుండా ఇతర ఏ మతానికి జరిగినా దేశం గగ్గోలు పెట్టేదని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

## మార్కాపురం పట్టణంలో ప్రజావేదిక సభలో పాల్గొననున్న సీఎం



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 24: మార్కాపురం జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం పర్యటించనున్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు తర్వాత ఇదే ఆయన తొలి పర్యటన కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనలో భాగంగా, పశ్చిమ ప్రకాశం ప్రజల దశాబ్దాల కలను సాకారం చేసే వెలిగొండ ప్రాజెక్టు అసంపూర్తి పనులను పూర్తి చేసే దిశగా కీలక ముందడుగు వేయనున్నారు. రూ.456 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఫీడర్ కెనాల్ పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారు.ముఖ్యమంత్రి పర్యటన వివరాల ప్రకారం, బుధవారం ఉదయం అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు అమరావతి నుంచి బయలుదేరుతారు. 12:40 గంటలకు మార్కాపురం జిల్లా గంటావానిపాలెం చేరుకుని, 12:50 గంటలకు వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులకు భూమి పూజ చేసి శంకుస్థాపన చేస్తారు. అనంతరం ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలిస్తారు. అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2:10 గంటలకు మార్కాపురం పట్టణానికి చేరుకుంటారు. 2:30 గంటలకు తర్లుపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన 'ప్రజావేదిక' బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సాయంత్రం 5:20 గంటలకు తిరిగి అమరావతికి పయనమవుతారు.మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలనేది ఆ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ. ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి, టీడీపీ ప్రభుత్వం జనవరిలో మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదల చేసింది. మరోవైపు, గత వైసీపీ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టులో కీలకమైన కెనాల్స్, ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్, జంట సొరంగాల పనులు పూర్తి చేయకుండా, నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండానే ప్రాజెక్టును జాతికి అంకితం చేసినట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో, ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పూర్తి చేసి ప్రజలకు సాగు, తాగునీరు అందించాలని ప్రస్తుత ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగానే ఫీడర్ కెనాల్ పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నారు. ఈ పర్యటనతో జిల్లా అభివృద్ధి, ప్రాజెక్టుల పూర్తిపై ప్రభుత్వం స్పష్టమైన భరోసా ఇవ్వనుందని స్థానికులు ఆశిస్తున్నారు.

## వైసీపీ పాలనలో ఎన్నో విధ్వంసాలు: సీఎం చంద్రబాబు నాయుడు



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 24: గత వైసీపీ పాలనలో ఎన్నో విధ్వంసాలు చూశామని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఏపీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. దేవాలయాలపై దాడులు జరిగాయని ప్రశ్నిస్తే కేసులు పెట్టారన్నారు. రాముడి విగ్రహం ధ్వంసం చేశారని ప్రశ్నిస్తే తనపైనే దాడికి దిగారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రక్షాళన కోసం ఈవోను నియమించామని చెప్పారు. తన దృష్టికి వచ్చిన నేషనల్ డైయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ రిపోర్ట్ వివరాలు వెల్లడించానని తెలిపారు. శ్రీవారి లడ్డూ విషయంలోనే కాదు.. అనేక విషయాల్లో తప్పు చేశారంటూ వైసీపీ నేతలపై ఆయన మండిపడ్డారు. కుట్ర కోణాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. 59.71లక్షల కేజీల రసాయనాలతో కూడిన నెయ్యిని లడ్డూ తయారీలో వినియోగించారని వివరించారు. తద్వారా రూ. 234.51 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారంటూ వైసీపీ అగ్రనేతలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాబ్‌ల కళ్లుగప్పి నెయ్యి టెండర్లు దక్కించుకున్నారని విమర్శించారు. 2019 – 24 మధ్య రసాయనాలతో తయారు చేసిన నెయ్యితో 20 కోట్ల లడ్డూలు తయారు చేశారని పేర్కొన్నారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని సీఎం చంద్రబాబు గణాంకాలతో సహా వివరించారు. 2026 జనవరి 23న ఈ కల్తీ లడ్డూ వ్యవహారంలో సీబీఐ చార్జ్‌షీట్ వేసిందని గుర్తు చేశారు. అలిపిరి ఘటనలో శ్రీవేంకటేశ్వర స్వామి వారే తన ప్రాణాలను కాపాడారని సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.కల్తీ నెయ్యి వినియోగం లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సిట్ వేయాలని ఆలోచించినట్లు ఏపీ సీఎం తెలిపారు. సిట్ ఏర్పాటును వైసీపీ నేతలు సుప్రీంకోర్టులో సవాల్ చేశారని గుర్తు చేశారు. రాజకీయ వివాదం ఉండొద్దనే కేంద్ర, రాష్ట్ర అధికారులతో సిట్ ఏర్పాటు చేశామని వివరించారు. సీబీఐ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీం సూచించిందన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపిందని పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని చెప్పినందుకే ఏకసభ్య కమిటీ అని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సీబీఐ రిపోర్టుతోపాటు ఫోరెన్సిక్ ఆధారాలను ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు.2020 జనవరి, ఫిబ్రవరిలో టెండర్ల నిబంధనలు మార్చారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. నాణ్యతా ప్రమాణాలకు సైతం వారు తిలోదకాలిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022 మేలో భోలేబాబా సంస్థపై ఫిర్యాదు, విచారణకు ఆదేశించారన్నారు. 2022 ఆగస్టులో బీటా సిటోస్టిరాల్‌తో రసాయనాలు కలిశాయని నివేదిక వచ్చిందని చెప్పారు. జఖీ=× ల్యాబ్ రిపోర్ట్ వస్తే.. దానిని సైతం తొక్కిపెట్టారన్నారు. 2024 జులై 23న చీఐఐదీ రిపోర్ట్ వచ్చిందని.. అందులోని అంశాలనే భగవంతుడు తనతో చెప్పించాడని సీఎం చంద్రబాబు తెలిపారు.జంతు కొవ్వు కలిసిందని తాను సొంతంగా చెప్పలేదని స్పష్టం చేశారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలన్న నిబంధనను సైతం తొలగించారన్నారు. 2019 ఆగస్టులో టెండర్ నిబంధనల్లో సడలింపు చేశారని చెప్పారు. టర్నోవర్, పాల సేకరణ సామర్థ్యాన్ని కూడా తగ్గించారని పేర్కొన్నారు. 2020 జనవరిలో శ్రీ వైష్ణవి ప్లాంట్‌ను తనిఖీ చేసి.. ఉత్పత్తి సామర్థ్యం లేకపోయినా నెయ్యి సరఫరాకు అనుమతి ఇచ్చారన్నారు. కేజీకి రూ.329 చొప్పున భోలేబాబాకు నెయ్యి సరఫరా ఆర్డర్ ఇచ్చారని పేర్కొన్నారు. 2022 జూన్‌లో ఫతేపూర్‌లోని భోలేబాబా ప్లాంట్ తనిఖీ చేసి.. డబ్బులు ఇవ్వలేదని ఆ సంస్థపై అనర్హత వేటు వేశారని సీఎం చంద్రబాబు చెప్పారు. ఒక పథకం ప్రకారం తిరుమల పవిత్రతను దెబ్బ తీసేందుకు కుట్ర చేశారంటూ వైసీపీ నేతలపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు.

తిరుమలకు ఏ మతస్థులైనా రావొచ్చునని.. అన్యమతస్థులు శ్రీవారి దర్శనానికి వస్తే డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉందన్నారు. అధికారంలో ఉన్నామని నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించారని చెప్పారు. టెండర్ నిబంధనలను పూర్తిగా గాలికొదిలేశారన్నారు. నాటి టీటీడీ బోర్డు చైర్మన్ పీఏ చిన్నఅప్పన్న లంచం తీసుకుని దొరికిపోయారని చెప్పారు. ఇవన్నీ నాటి టీటీడీ చైర్మన్, బోర్డుకు తెలిసే జరిగాయని తెలిపారు. నాడు లడ్డూలో నాణ్యత తగ్గిపోయిందని చాలా ఆరోపణలు వచ్చాయని గర్తు చేశారు. కల్తీ నెయ్యి తయారీకి ముఠాగా ఏర్పడ్డారని సీఎం చంద్రబాబు మండిపడ్డారు.

నాటి టీటీడీ చైర్మన్ పీఏ చిన్నప్పన్న రూ.4.5 కోట్ల లంచం తీసుకున్నారన్నారు. నకిలీ సర్టిఫికెట్లతో టెండర్లు దక్కించుకుని రసాయనాల నెయ్యి సరఫరా చేశారని తెలిపారు. కల్తీ నెయ్యి తయారీకి వివిధ రకాల రసాయనాలు వినియోగించినట్టు దర్యాప్తులో తేలిందని సీఎం చంద్రబాబు తెలిపారు.

## శ్రీవారి ప్రసాదం కల్తీపై అసెంబ్లీలో చర్చించడం బాధాకరం: మంత్రి ఆనం

క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 24: తిరుమలలో శ్రీవారి భక్తులకు అందించే ప్రసాదం కల్తీ, అపవిత్రంపై అసెంబ్లీ వేదికగా చర్చించాల్సి రావడం బాధాకరమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం అసెంబ్లీలో తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి వినియోగించిన కల్తీ నెయ్యిపై చర్చ జరిగింది. ఈ చర్చను మంత్రి ఆనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఆర్ డెయిరీతో పాటు అనుబంధ డెయిరీలు ఈ కల్తీ నెయ్యిని సరఫరా చేశాయని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ప్రొక్యూర్‌మెంట్ విభాగం జనరల్ మేనేజర్ పి.మురళీ కృష్ణ ఫిర్యాదుతో లడ్డూ వ్యవహారంపై పోలీసులు కేసు

2 లో



## శ్రీవారి ప్రసాదం కల్తీపై అసెంబ్లీలో చర్చించడం బాధాకరం: మంత్రి ఆనం

నమోదు చేశారని తెలిపారు. ఈ ఫిర్యాదు మేరకు 2024 సెప్టెంబర్ 25న ఆహార కల్తీ, మోసం, కుట్ర అభియోగాలతో కేసు నమోదైందని గుర్తు చేశారు. దీనిపై ప్రత్యేక దర్యాప్తు విభాగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరించారు. ఆ తర్వాత సీబీఐ విచారణకు ఆదేశించామని చెప్పారు.నిజమైన నెయ్యి సేకరించేందుకు టెండర్ నిబంధనలు గతంలో కఠినంగా ఉండేవని మంత్రి ఆనం గుర్తు చేశారు. కానీ 2020 ఫిబ్రవరిలో అప్పటి ప్రభుత్వం ఆ నిబంధనలు సడలించిందని వివరించారు. అనుభవం, వార్షిక టర్నోవర్, పాల సేకరణ తప్పనిసరి.. తదితర నిబంధనలన్నింటినీ తొలగించారన్నారు. అనుభవంలేని ప్రైవేట్ డెయిరీల ప్రవేశానికి నిబంధనల సడలింపు అవకాశం కల్పించిందని చెప్పారు. తక్కువ ధరకే నెయ్యి సరఫరా చేస్తున్నట్లు చెప్పి కల్తీ నెయ్యి పంపిణీ చేశాయని విమర్శించారు. 2024 మార్చిలో టెండర్ ఆహ్వానించగా ఏఆర్ డెయిరీ కిలోకు రూ.319 చొప్పున సరఫరా చేసేందుకు ముందుకొచ్చిందన్నారు. సరైన నాణ్యత పరీక్షలు నిర్వహించకుండానే ఆ సంస్థకు చెందిన నెయ్యి కొనుగోలు చేశారని చెప్పారు. అనంతరం నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపగా.. వనస్పతి, జంతు కొవ్వు కలిశాయని నివేదిక వచ్చిందన్నారు. నెయ్యి సేకరణలో వ్యవస్థాగత లోపాల కారణంగా కల్తీకి అవకాశమిచ్చారని విమర్శించారు. డిజిటల్ రికార్డుల ధ్వంసం, డాక్యుమెంటేషన్ తారుమారు, టెండర్ కేటాయింపులో గోల్‌మాల్ చేసినట్లు ఆధారాలు లభించాయని తెలిపారు. దాంతో కుట్ర, మోసం, ఫోర్జరీ, అవినీతి, సాక్ష్యాలు ధ్వంసం, ఆహార కల్తీ, నేరపూరిత ఉల్లంఘన జరిగిందని సిట్.. తన ఛార్జ్‌షీట్‌లో వెల్లడించిందని మంత్రి ఆనం రెడ్డి తెలిపారు.

## నేడే ఏపీ డాబాల్యూ జెఎఫ్ డైరీ ఆవిష్కరణ..

### ప్రజా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో కార్యక్రమం..







ఎన్టీఆర్ జిల్లా,విజయవాడ,ఫిబ్రవరి 24(క్రైం కౌంటర్ డెస్క్):ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీ డాబాల్యూ జెఎఫ్) ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ ని ఇబ్రహీంపట్నంలోని ప్రజా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో 25వ తేదీన ఉదయం 10 గంటలకు ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ డాబాల్యూ జెఎఫ్ రాష్ట్ర మరియు జిల్లా నాయకులు హాజరు కానున్నారు. సంఘ సభ్యులు, జర్నలిస్టు మిత్రులు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ డాబాల్యూ జెఎఫ్ ఎన్టీఆర్ జిల్లా జాయింట్ సెక్రెటరీ మెరుగుమాల రాఘవులు, ఏపీ డాబాల్యూ జెఎఫ్ మైలవరం నియోజకవర్గ అధ్యక్షులు షేక్.సల్మాన్, ప్రధాన కార్యదర్శులు వి.సురేష్ కోరారు.

## నేడు వెలిగొండకు సీఎం

**ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు శంకుస్థాపన**

**అనంతరం మార్కాపురంలో బహిరంగ సభ**

**కొత్త జిల్లా ఏర్పాటు తర్వాత..చంద్రబాబు రావడం ఇదే తొలిసారి**



క్రైం కౌంటర్ న్యూస్, మార్కాపురం, ఫిబ్రవరి 24 ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్తగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశాక.. ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటిసారి ఇక్కడకు రానున్నారు. బుధవారం బహిరంగ సభలో పాల్గొననున్నారు. అంతకుముందు ఆయన దోర్నాల మండలం గంటవానిపల్లి వద్ద పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ పనులకు శంకుస్థాపన చేస్తారు. జగన్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిచేయకుండానే జాతికి అంకితం చేసి ప్రజలను మోసగించింది. కనీసం ఫీడర్ కాలువ పటిష్ఠతపై కూడా దృష్టిపెట్టకపోవడంతో పలుచోట్ల గండ్లుపడి కట్టలు తెగిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫీడర్ కాలువ లైనింగ్, రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.456 కోట్లు మంజూరు చేసింది. షెడ్యూల్ ప్రకారం సీఎం మధ్యాహ్నం 12.40 గంటలకు గంటవానిపల్లి వద్దకు చేరుకుని.. ఫీడర్ కాలువ పనులకు శంకుస్థాపన చేస్తారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై అధికారులతో మాట్లాడతారు. అనంతరం మార్కాపురం చేరుకుంటారు. మధ్యాహ్నం తర్లుపాడు రోడ్డులో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. పర్యటనకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసింది.

## బస్సుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. .

**తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆర్టీసీ కార్మికులు..**

**నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గెట్ ధర్నా..**



ఎన్టీఆర్ జిల్లా,విజయవాడ సిటీ, ఫిబ్రవరి 24(క్రైం కౌంటర్ డెస్క్): ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో వద్ద ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో హోరెత్తిన గేట్ ధర్నా ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ రాష్ట్ర ఆర్టీసీ యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేడు ఇబ్రహీంపట్నం డిపో వద్ద భారీ నిరసన ప్రదర్శన మరియు గేట్ మీటింగ్ నిర్వహించారు. 12డిపోలలో ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలనే నిర్ణయంపై కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా ప్రెసిడెంట్ సి హెచ్ .రామకృష్ణ, జిల్లా నాయకులు సుభాని మాట్లాడుతూ విద్యాధరపురం వంటి కీలకమైన డిపోను పూర్తిస్థాయిలో ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడం అక్కడి సిబ్బందిని బలవంతంగా బదిలీ చేయడం అత్యంత అన్యాయం అని సంస్థను నష్టాల్లోకి నెట్టే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి ఆర్టీసీ ఆస్తులను కాపాడు కోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధం అని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో డిపో అధ్యక్ష కార్యదర్శులు పి. శ్రీనివాసరావు,బీవీ ఆంజనేయులు,డిపో పబ్లిసిటీ సెక్రటరీ మోహన్ గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గున్నారు.

## కవరు తొడిగిన మామిడికి మంచి రేటు.. బంగినపల్లి రకం టన్ను రూ.లక్షా 80 వేలు



క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 24: అమరావతి-మధుర ఫలం.. బంగినపల్లి మామిడి ధర అ'ధర'హో అనిపించింది! పురుగు ఆశించకుండా రక్షణగా నిలిచే కవర్లు తొడిగి పండిస్తున్న మామిడి కాయలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో బంగినపల్లి రకం టన్ను రూ.లక్షా80వేల దాకా పలుకుతోంది. కవర్లు లేకుండా పండించిన కాయలు టన్ను రూ.90వేలు కూడా పలకడం లేదు. కవర్లు కట్టిన తోతాపురి రకం మామిడి కూడా టన్ను రూ.లక్షపైనే పలుకుతోంది. సీజన్‌కు ముందే ధర పెరగడంతో మామిడి రైతుల ఆనందానికి అవధుల్లేవు. సాధారణంగా తొలి దశ కోత తర్వాత ధర తగ్గడం సహజం. కానీ ఈ సారి ధర తగ్గే ప్రసక్తే లేదని అధికారులు ధీమాగా చెప్తున్నారు. దీనికి కారణం.. రెండేళ్లుగా ఉద్యానశాఖ రాయితీపై పండ్ల తోటల రైతులకు కవర్లు సరఫరా చేస్తోంది. ఈ కవర్లు కట్టిన పండ్లు కంటికి ఇంపుగా కనిపించడమే కాకుండా, నాణ్యత చాలా బాగుంటోంది. అందువల్ల చాలా మంది రైతులు కవర్లు వాడటానికి ముందుకొస్తున్నారు. నిరుడు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తోతాపురి మామిడి ధర పడిపోయి, రైతులు నష్టపోయారు. రైతులకు కిలో రూ.12 ధర వచ్చేలా, వ్యాపారులు రూ.8 చెల్లిస్తే ప్రభుత్వం రూ.4 భరించింది. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లాలో టన్ను తోతాపురి మామిడి రూ.లక్షపైగా పలకడం విశేషం.

**ఎన్టీఆర్ జిల్లాలో ముందస్తు కోతలు**

రాష్ట్రవ్యాప్తంగా 10లక్షల ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా, ఎన్టీఆర్ జిల్లాలో 57వేల ఎకరాల్లో బంగినపల్లి, తోతాపురి, రసాలు, సువర్ణరేఖ రకాల మామిడి తోటలున్నాయి. విజయవాడ రూరల్, విసన్నపేట, ఎ.కొండూరు, జి.కొండూరు, రెడ్డిగూడెం, మైలవరం, తిరువూరు, నూజివీడు, జగ్గయ్యపేట, నందిగామ ప్రాంతాల్లో మామిడి సాగులో ఉంది. ఈ జిల్లా నుంచి ఏటా 2.30 లక్షల టన్నుల మామిడి ఉత్పత్తి అవుతోంది. రెడ్డిగూడెం మండల రైతుల సాగు విధానం ప్రత్యేకంగా ఉండడంతో ఏటా పూత, కాయ త్వరగా వస్తోంది. 20 రోజులుగా ఈ జిల్లాలోని మామిడి తోటల్లో రైతులు కాపుకొచ్చిన పండ్లను కోస్తున్నారు. పెద్ద సైజులో, నాణ్యంగా ఉన్న పండ్లను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. మామిడి పచ్చళ్ల తయారీ కోసం ఉత్తరాది రాష్ట్రాల వ్యాపారులూ వచ్చి మంచి ధరకు కొనుగోలు చేస్తున్నారు. నున్న, రెడ్డిగూడెం, విసన్నపేట, ఎ.కొండూరు, మైలవరం ప్రైవేట్ మార్కెట్ల ద్వారా రైతులు విక్రయిస్తున్నారు.

**కవర్ల తొడుగుతో నాణ్యత, ధరలో వ్యత్యాసం**

కవర్లు కట్టిన మామిడి కాయలకు, కవర్లు లేకుండా పండించే కాయలకు నాణ్యతలో చాలా తేడా ఉంటోంది. ధర కూడా సగానికి సగం వ్యత్యాసం ఉంటోంది. కవర్ల వల్ల తెగుళ్లు, కోతలు, పక్షులు, ఇతర జంతువుల నుంచి రక్షణ లభిస్తుంది. చెట్లకు రసాయన మందులు పిచికారీ చేసినప్పుడు కాయలపై పడకుండా ఉంటాయి. కోత సమయంలో పండ్లు నేలపై పడినా దెబ్బతినకుండా ఉంటాయి. మంగు, మచ్చ, డాగు లేకుండా నిగనిగలాడుతూ నాణ్యతగా ఉంటాయి. మామిడి పండ్లకు తొడిగే కవర్లకు ఉద్యానశాఖ 50% రాయితీ ఇస్తోంది. కవరు కేవలం రూ.2 మాత్రమే. అయితే కవర్ తొడగటానికి కూలీలు కవరుకు రూపాయి తీసుకుంటున్నారని రైతులు చెప్తున్నారు. మామిడితో పాటు జామ, అరటి, దానిమ్మ వంటి పండ్ల రైతులకు కూడా ఉద్యానశాఖ రాయితీపై కవర్లను అందిస్తోంది. 2025-26లో పండ్ల కవర్ల బడ్జెట్‌ను రూ.10కోట్లనుంచి రూ.36కోట్లకు పెంచినట్లు ఉద్యానశాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. కాగా ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో ప్రస్తుతం మామిడి తోటలకు తెగుళ్లు విజృంభించడంతో పూత నిలబడక, దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తల సిఫారసు మేరకు క్రిమి సంహారక మందులు పిచికారి చేయాలని, మామిడి పండ్లకు కవర్లు రక్షణగా నిలుస్తాయని ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు.

## నిర్మాణాత్మకంగా ఉండకుండా రాజకీయాలకే పరిమితం

**అందుకే మనమే విపక్ష పాత్రా పోషించాలి**

**మంత్రులు, ఎమ్మెల్యేల ప్రసంగాలను ఏఐ ద్వారా విశ్లేషిస్తా**

**అసెంబ్లీ జరిగినన్ని రోజులూ ఒక అంశంపై లఘు చర్చ**

**సందర్భాన్ని బట్టి నేను, పవన్ చర్చలో పాల్గొంటాం**

**క్యాబినెట్ భేటీ తర్వాత మంత్రులతో సీఎం చంద్రబాబు**



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 24 'మనం అసెంబ్లీలో మాట్లాడే ప్రతి మాటకూ ఎంతో విలువ ఉంటుంది. అసెంబ్లీలో మాట్లాడితే రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ వెళ్లి మాట్లాడినట్లే! ఏడాదిపాటు ఊర్లలో తిరిగి మనం చేసే కార్యక్రమాల ద్వారా ఎలాంటి ప్రయోజనం పొందుతామో.. ఒక రోజు అసెంబ్లీలో మాట్లాడడం ద్వారా అంతకంటే ఎక్కువ ప్రయోజనం లభిస్తుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. మంగళవారం రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ముగిసిన తర్వాత.. తాజా రాజకీయ పరిణామాలపై సహచర మంత్రులతో ఆయన చర్చించారు. అసెంబ్లీ సమయం ఎంతో విలువైందని.. సభలో ప్రతిపక్షం పాత్ర కీలకమని, కానీ వైసీపీ నిర్మాణాత్మక పాత్ర పోషించకుండా.. మండలిలోనూ రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని, ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసలు సభకే రాకుండా బయట రాజకీయాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుచేత ప్రతిపక్ష పాత్రను కూడా మనమే పోషించాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీలో వివిధ శాఖల పద్దులపై జరిగే చర్చల్లో మంత్రులు బాగా సిద్ధమై వచ్చి మాట్లాడాలని.. ఒక మంత్రి ఒక సబ్జెక్టుపై మాట్లాడినప్పుడు.. అనుబంధంగా మాట్లాడేవారూ కంటెంట్‌తో మాట్లాడితేనే ప్రజల్లోకి ఆ అంశం బలంగా వెళ్తుందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల ప్రసంగాలు ఎలా ఉన్నాయో కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా విశ్లేషణ చేయిస్తానని చెప్పారు.

**ప్రతిరోజూ పరీక్షే..**

ప్రజల పక్షాన నిలవాల్సిన ప్రతిపక్షం కేవలం రాజకీయమే చేస్తోందని, దీంతో మనమే అధికారపక్షంతోపాటు ప్రతిపక్ష పాత్ర కూడా పోషించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో మనకు ప్రతి రోజూ పరీక్షేనని సీఎం వ్యాఖ్యానించారు. ప్రభుత్వం చేసే మంచి పనిని కిందిస్థాయి వరకు తీసుకెళ్లాలని సూచించారు. మంత్రులు తమ శాఖల్లో చేసే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. మంత్రులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మంత్రులతో బాగా సమాధానాలు ఇప్పించే బాధ్యత సభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌దేనని స్పష్టం చేశారు. అసెంబ్లీ జరిగినన్ని రోజులూ మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 వరకు ఒక్కో అంశంపై లఘు చర్చ చేపడదామని సూచించారు. ఇందుకు తగ్గట్లుగా అంశాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సందర్భాన్ని బట్టి తాను, పవన్ కల్యాణ్ చర్చల్లో పాల్గొంటామన్నారు. వ్యవసాయ రంగంలో ప్రభుత్వం చేస్తున్న కృషి అసెంబ్లీ వేదికగా ప్రజల్లోకి బాగా వెళ్లాలన్నారు.అలాంటి ఘటనలు పునరావృతం కాకూడదు. శ్రీకాకుళంలో డయేరియా, రాజమండ్రిలో కల్తీపాలు ఘటనలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశించామని, ఈ రెండు ఘటనలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, ఇలాంటి ఘటనలు ఎట్టిపరిస్థితుల్లో పునరావత్ృం కాకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఈ నెల 28నే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఇస్తున్నామని.. వీటి పంపిణీలో మంత్రులు, ఎమ్మెల్యేలు తప్పనిసరిగా పాల్గొనాలని, అందకు అనుగుణంగా 28న అసెంబ్లీకి సెలవు ప్రకటించాలని పయ్యావులను సీఎం కోరారు. కాగా.. ఎజెండాలోని అంశాల్లో.. హెరిటేజ్ కంపెనీతోపాటు 10 కంపెనీల విస్తరణకు స్థల కేటాయింపులు కూడా ఉన్నాయి. ఈ కేటాయింపులకు సంబంధించిన అంశాలు క్యాబినెట్‌లో చర్చకు వచ్చినప్పుడు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సమావేశం నుంచి వెళ్లిపోయారు.

# బాధితుల రక్తంలో.. యూరియా, క్రియాటినిన్

**అందుకే విషపూరిత ప్రభావం**
**అనూరియా బాధితుల కేసుల్లో కల్తీ పాలే ప్రధాన కారణమని నిర్ధారణ**
**వైద్య ఆరోగ్య శాఖ ప్రాథమిక నివేదిక**
**ఆస్పత్రుల్లో 15 మందికి వైద్యం**
**వారిలో ఏడుగురి పరిస్థితి విషమం**
**చికిత్స పొందుతూ ఆరేళ్ల బాలుడి మృతి**
**ఆరుకు చేరిన కల్తీ పాల మృతులు**



క్రైం కౌంటర్ న్యూస్, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, ఫిబ్రవరి 24 కల్తీపాల బాధితుల రక్తంలో యూరియా, సీరమ్ క్రియాటినిన్ స్థాయిలు అధికంగా ఉ ఒడడం వల్లే విషపూరిత ప్రభావం ఉందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. వైద్యఆరోగ్యశాఖ ప్రాథమిక నివేదికలో ఈ విషయం స్పష్టమైందని చెప్పారు. ప్రాథమిక ఎపిడెమియాలజికల్ పరిశీలనలో కల్తీ పాల వినియోగమే దీనికి ప్రధాన కారణమని తేలిందన్నారు. కల్తీ పాల ఘటనలో 15 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారిలో ఏడుగురు వెంటిలేటర్, డయాలిసిస్ సహాయంతో చికిత్స పొందుతున్నారని చెప్పారు. మిగిలిన వారికి ప్రాణాపాయం తప్పిందన్నారు. జిల్లా పర్యవేక్షణాధికారి, వైద్యనిపుణులు, శాస్త్రవేత్తలు, నెఫ్రాలజిస్టులతో కూడిన అధికారులతో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. 14 ఫీల్డ్ సర్వేలెన్స్ బృందాలు 679 ఇళ్లను సందర్శించి 957 కుటుంబాలను స్క్రీనింగ్ చేశాయని, 110 కుటుంబాల్లో 315 మంది రక్తనమూనాలు సేకరించాయని చెప్పారు. వాటిలో 313 సాధారణ పరిస్థితుల్లో ఉండగా రెండు నమూనాల్లో మాత్రం యూరియా, క్రియాటినిన్ స్థాయిలు పెరిగినట్టు తేలిందన్నారు. ఇప్పటికే వరలక్ష్మి మిల్క్‌డెయిరీలో తనిఖీలు చేసి పాలు, పన్నీర్, నెయ్యి, మంచినీరు, వెనిగర్ నమూనాలు సేకరించామని, ప్రభావిత ఇళ్ల నుంచి కూడా పాలు, పెరుగు నమూనాలు సేకరించామని తెలిపారు. వీటిని కాకినాడ జేఎన్‌టీయూ యూనివర్సిటీ, విమ్టా ల్యాబ్‌లకు పంపించామన్నారు. 41 పాల నమూనాలు, పశువులకు ఇచ్చే ఆహారం, నీటి నమూనాలు సేకరించి వెటర్నరీ బయలాజికల్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు పంపినట్టు తెలిపారు.

విశాఖ కేజీహెచ్‌లో ఆరేళ్ల బాలుడి మృతి

కల్తీ పాలు తాగి అస్వస్థతకు గురైన రాజమహేంద్రవరానికి చెందిన ఆరేళ్ల బాలుడు మనోహర్ విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మనోహర్‌కు మూత్రంలో ఇబ్బందులు, కిడ్నీ సంబంధిత సమస్య తలెత్తడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యులు కాకినాడ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడి నుంచి ఈ నెల 18న కేజీహెచ్‌కు తీసుకువచ్చారు. ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి బాలుడికి యూరిన్ రాకపోవడం, కిడ్నీ సమస్య తీవ్రం కావడంతో డయాలసిస్ చేస్తూ వచ్చారు. మంగళవారం ఉ దయం నుంచి పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారడంతో వెంటిలేటర్ అమర్చారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో మనోహర్ మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు. కాగా, ఈ బాలుడి మృతితో కల్తీపాల మృతుల సంఖ్య ఆరుకు చేరింది.

కల్తీపాల కేసులో నిందితుడు గణేశ్ అరెస్ట్

కల్తీ పాల విక్రయం కేసులో నిందితుడు అడ్డాల గణ్ణ?షను పోలీసులు అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో రిమాండుకు తరలించారు. కోరుకొండ మండలం నరసాపురం గ్రామానికి చెందిన అడ్డాల గణేశ్వరరావు (గణేశ్) 11 ఏళ్లుగా తన గ్రామంలో వరలక్ష్మి డెయిరీ పేరుతో ఎలాంటి ప్రభుత్వ అనుమతులూ లేకుండా పాల కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. పాడి రైతుల నుంచి పాలు సేకరించి ఇళ్లకు వెళ్లి విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో ఈనెల 15న ఫ్రిడ్జ్‌లోని పాలు చూడగా ఒక క్యాన్‌లో అడుగున గడ్డకట్టడం గమనించాడు. అప్పటికే పైన ఉన్న పాలను కొందరికి అమ్మగా.. అవి చేదుగా ఉన్నాయని గణేశ్‌కి వాళ్లు చెప్పారు. గణేష్ ఈ విషయాన్ని నరేంద్రపురంలోని తన బావ దేగల గంగాధర్‌కు తెలిపాడు. అయితే, వాటిని విక్రయించవద్దని గంగాధర్ చెప్పినా వినకుండా సుమారు 105 మందికి ఆ పాలను విక్రయించానని గణేశ్ మధ్యవర్తుల సమక్షంలో చెప్పాడని సమాచారం. కాగా, కల్తీ పాలు తాగి మృతి చెందిన నలుగురికి ఎక్స్‌గ్రేషియాను కలెక్టర్ కిర్తీ చేకూరి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ మంగళవారం అందజేశారు. తాడి కృష్ణవేణి, తాడి రమణిల కుటుంబానికి రూ.20లక్షలు, నీలా శేషగిరిరావు కుటుంబానికి రూ.10లక్షల చెక్కు అందించారు.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం

చెన్నై, ముంబై నుంచి మందులు: వీరపాండియన్

రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనకు సంబంధించి ఆస్పత్రిలో ఉన్న వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. ప్రస్తుతం 15 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా వారిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. ఏపీఐఐసీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలలో యూరియా ఆనవాళ్లు గురించి ఇప్పటి వరకూ తమ దృష్టికి రాలేదని చెప్పారు. మంగళవారం కొత్త కేసులు నమోదు కాలేదన్నారు. పాలను శీతలీకరణ చేసే మిషన్లలో కూలెంటుగా ఉపయోగించే ఇథలిన్ గ్లైకాల్ లీక్ అయినట్లు పోలీసులు విచారణలో గుర్తించారన్నారు. చికిత్స పొందుతున్న వారి కోసం ఏపీలో అందుబాటులో లేని మందులను చెన్నై, ముంబై నుంచి తెప్పిస్తున్నామని వివరించారు.

కల్తీపాల ఘటన దురదృష్టకరం: పురందేశ్వరి

కల్తీపాలు తాగి 15మంది అనారోగ్యం పాలవడం దురదృష్టకరం, బాధాకరమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను మంగళవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణచౌదరితో కలిసి ఎంపీ పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని, వారి వైద్య ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని ఆమె మీడియాకు చెప్పారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లావ్యాప్తంగా పాలశీతలీకరణ యంత్రాలపై తనిఖీలు నిర్వహించాలన్నారు.

# లోకేశ్.. భేష్!

**సమస్యలపై మంత్రి తక్షణమే స్పందిస్తున్నారు**
**ఎ.కొండూరు కేజీబీవీలో విద్యార్థినులను ఎలుకలు కొరికిన ఘటనలో ఆదేశాలిచ్చారు**
**కలెక్టర్, జేసీ, యంత్రాంగమంతా తరలివెళ్లింది**
**కేజీబీవీల్లో శాశ్వత ప్రాతిపదికన పోస్టుల భర్తీపై కేంద్రంతో మాట్లాడుతున్నట్లు అసెంబ్లీలో చెప్పారు**
**హైకోర్టు కితాబు.. మంత్రి ఇలా పనిచేస్తుంటే అధికారులు నిర్లక్ష్యంతో చెడ్డపేరు తెస్తున్నారేం?**
**సర్వశిక్ష పీడీ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని ఫైర్**



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 24 రాష్ట్ర విద్యా మంత్రి లోకేశ్ పనితీరును హైకోర్టు ధర్మాసనం ప్రశంసించింది. ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)లో విద్యార్థినులను ఎలుకలు కొరికిన ఘటనపై తక్షణమే స్పందించారని గుర్తుచేసింది. ఆయన ఆదేశాలతో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో పాటు జిల్లా యంత్రాంగమంతా ఘటన స్థలానికి చేరుకుని విద్యార్థినులను ఆదుకున్నారని పేర్కొంది. 'కేజీబీవీల్లో పనిచేస్తున్న బోధనాసిబ్బందికి జీతాలు పెంచడంతోపాటు శాశ్వత ప్రాతిపదికన పోస్టుల భర్తీ చేయడంపై కేంద్రంతో చర్చిస్తున్నామని శాసనసభలో ఆయన ప్రకటన చేసినట్లు పత్రికల్లో చూశాం. మంత్రి ఈ విధంగా పనిచేస్తున్నప్పుడు కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రభుత్వానికి, మంత్రికి ఎందుకు చెడ్డపేరు తెస్తున్నారు' అని వ్యాఖ్యానించింది. కేజీబీవీల్లో పీజీటీల నియామకానికి సంబంధించి సింగల్ జడ్జి ఉత్తర్వులను అమలు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకపోవడంపై సుమోటోగా నమోదు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్ విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. గత విచారణ సందర్భంగా ధర్మాసనం సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు వైఖరిని తప్పుపట్టింది. దిగువ స్థాయి అధికారిని రక్షించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని ఆక్షేపించింది. కోర్టు ఉత్తర్వులు అమలు చేయని అధికారులపై తీసుకున్న చర్యలపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. మంగళవారంనాటి విచారణలో ప్రాజెక్ట్ డైరెక్టర్ వేసిన అఫిడవిట్‌ను పరిశీలించింది. 'గత విచారణలో బాధ్యులైన అధికారికి నోటీసు ఇచ్చామని చెప్పారు. అఫిడవిట్‌లో కోర్టు విచారణ తర్వాత నోటీసు జారీ చేసినట్లుగా ఉంది.

ఐఏఎస్ అధికారి అయిఉండి కోర్టును తప్పుదోవ పట్టిస్తారా? మీపై క్రిమినల్ కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేస్తాం. తగిన చర్యలు తీసుకునే నిమిత్తం సిబ్బంది–శిక్షణ విభాగానికి సిఫారసు చేస్తాం' అని శ్రీనివాసరావును హెచ్చరించింది. ప్రస్తుత అఫిడవిట్ సంతృప్తికరంగా లేదని, తాజాగా మరోసారి దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను మూడువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టుదేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు.. కేజీబీవీల్లో శాశ్వత ప్రాతిపదికన పోస్టుల భర్తీపై ఇరుపక్షాల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

ఇదీ కేసు.. సమగ్ర శిక్ష పథకం కింద నిర్వహించే కేజీబీవీల్లో పార్ట్‌టైం పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్లు(పీజీటీలు)గా పనిచేస్తున్న తమను అర్ధాంతరంగా తొలగించడాన్ని సవాల్ చస్తూ 2023లో వారు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. పిటిషనర్లను ఉద్యోగాల్లో కొనసాగించాలని, ఒప్పందం ముగిసిన అనంతరం కూడా కొనసాగించే విషయాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశిస్తూ 2023 డిసెంబరు 5న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ అధికారులు 2024 జనవరిలో ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. ఈ అప్పీల్ విచారణ సందర్భంగా సింగిల్ జడ్జి ఉత్తర్వులను అమలు చేస్తామని ఇచ్చిన హామీ పూర్తిస్థాయిలో అమలుకాకపోవడంతో సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావుపై సుమోటో కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించింది. గత విచారణ సందర్భంగా ఆయన నేరుగా ధర్మాసనం ముందు హాజరయ్యారు. ఆయన ఇచ్చిన సమాధానాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన ధర్మాసనం.. కోర్టు ఉత్తర్వులు అమలు చేయని అధికారులపై ఏమి చర్యలు తీసుకున్నారో సవివరంగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే.

# రూ.2,387 కోట్లతో సెమీకండక్టర్ పరిశ్రమ

**40శాతం, అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికీ ఫ్రీ బస్సు**
**నీరు–చెట్టు పనుల కేసులు ఎత్తివేతకు నిర్ణయం**
**క్యాబినెట్ సమావేశంలో 57 అంశాలకు ఆమోదం**



క్రైం కౌంటర్ న్యూస్, అమరావతి, ఫిబ్రవరి 24 విశాఖపట్నం జిల్లా ఆనందవరం మండలం తర్లువాడ గ్రామంలో రూ.2,387.81 కోట్లతో నిర్మించే సెమీకండక్టర్ పరిశ్రమకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఏపీ సెమీ కండక్టర్ అండ్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ 2024–29 కింద ప్రత్యేక ప్రోత్సాహకాలు విస్తరించేందుకు ఈ నెల 18న జరిగిన ఎస్ఐపీబీలో తీసుకున్న సిఫారసులను అనుమతించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో 57 అంశాలకు ఆమోదం లభించింది.

క్యాబినెట్ ఆమోదించిన మరికొన్ని నిర్ణయాలు ఇవీ...

ఏపీ మోటార్ వెహికల్స్ టాక్సేషన్ సవరణ బిల్లు–2026ను ప్రవేశపెట్టడానికి ఆమోదం. మోటారు వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలో చెల్లించాల్సిన లైఫ్‌ట్యాక్స్‌పై 10% అదనపు పన్నును రోడ్డు సేఫ్టీ సెస్‌గా విధించి వసూలు చేయడానికి 3–సీ లెవీ ఆఫ్ రోడ్ సేఫ్టీ సెస్ అనే కొత్త సెక్షన్‌ను ప్రవేశపెట్టడానికి ఈ బిల్లు ప్రవేశపెట్టనుంది.

స్త్రీశక్తి పథకంలో భాగంగా 40శాతం, అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని విస్తరించడానికి ఆమోదం. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట?ట్ర పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రస్తుతం ఇస్తున్న 50 శాతం రాయితీని కొనసాగింపునకు అనుమతి.

చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం పట్నం గ్రామంలో 18.60 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వయంభూ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి కేటాయించారు. కాణిపాకం యాత్రికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడానికి, అభివృద్ధి కార్యకలాపాలకు మార్కెట్ విలువ ఎకరా రూ.8.75 లక్షల చొప్పున కేటాయిస్తారు.

ప్రస్తుత 'పర్యావరణ, అటవీ, విజ్ఞాన, సాంకేతిక శాఖ'ను 'పర్యావరణ, అటవీశాఖ'గా నామకరణం చేయాలని ప్రతిపాదించింది. 'సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ శాఖ'ను కొత్తగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఫిబ్రవరి 11న జరిగిన ఉభయ సభల సంయుక్త సమావేశంలో గవర్నర్ ప్రసంగానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది.

కొల్లేరు వన్యప్రాణి అభయారణ్య సరిహద్దుల హేతుబద్ధీకరణపై 48వ నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్‌లైఫ్ సమావేశం చేసిన సిఫారసుల ప్రకారం చర్యలు తీసుకోవడానికి సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీని సంప్రదించేందుకు చేసిన ప్రతిపాదనలను ఆమోదించింది.

విశాఖపట్నం రుషికొండలో వి హోటల్ అనే స్వంత బ్రాండ్ కింద 3–స్టార్ హోటల్ అభివృద్ధి కోసం వీరాంజనేయ హాస్పిటాలిటీకి ప్రోత్సాహకాలకు ఆమోదం.

సత్యసాయి జిల్లా పెనుగొండలోని గనగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం పాదపీఠం వద్ద మెగా స్పిరిచ్యువల్ అండ్ కల్చరల్ టూరిజం సెంటర్–బేస్ క్యాంప్ అభివృద్ధి కోసం బెంగుళూరు ఇస్కాన్‌కు భూమి, ప్రోత్సాహకాలు అందించేందుకు జారీ చేసిన ఉత్తర్వులకు అనుమతి లభించింది.

విశాఖ జిల్లా తర్లువాడలో అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌కు 30 ఎకరాల కేటాయింపు, పెట్టుబడికి ప్రత్యేక ప్రోత్సాహకాలు విస్తరించడానికి ఎస్ఐపీబీ సిఫారసులకు ఆమోదం.



# సినిమా



## ఉస్తాద్ భగత్ సింగ్‌లో అవేం ఉండవు..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలున్నాయి. ఇటీవల విడుదలైన 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పాటకు వస్తున్న అద్భుతమైన రెస్పాన్స్ చూసి... పవన్ కళ్యాణ్ ప్రస్తుత రాజకీయ ఇమేజ్‌కు తగ్గట్టుగా సినిమాలో పవర్ ఫుల్ పొలిటికల్ సెటైర్లు, డైలాగులు ఉంటాయని అభిమానులు లెక్కలేసుకున్నారు. అయితే అందరి అంచనాలను తలకిందులు చేస్తూ.. సినిమాలో ఎలాంటి రాజకీయ అంశాలు, సెటైర్లు, రెఫరెన్సులు ఉండవని దర్శకుడు హరీష్ శంకర్ తాజాగా తేల్చి చెప్పారు. పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం హోదాలో ఉన్నప్పటికీ, ఈ సినిమా పూర్తిగా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా మాత్రమే ప్రేక్షకుల ముందుకు రాబోతోందని స్పష్టం చేశారు. సినిమాలో పాలిటిక్స్‌కు సంబంధించినవి ఏమీ ఉండవని ముందుగానే దర్శకుడు ప్రకటించడం వెనక ఒక స్పష్టమైన వ్యూహం, ఓ బలమైన కారణం ఉంది. సినిమాను రాజకీయాలతో ముడిపెట్టవద్దని, ఎవరినీ ఉద్దేశించి వ్యక్తిగతంగా లేదా ఏ రాజకీయ పార్టీని టార్గెట్ చేస్తూ డైలాగులు ఉండకూడదని పవన్ కళ్యాణ్ మొదటి రోజే హరీష్ శంకర్‌కు కచ్చితమైన ఆదేశాలు ఇచ్చారు. రాజకీయంగా సైద్ధాంతిక విభేదాలు ఉన్నప్పటికీ ప్రకాష్ రాజ్ లాంటి నటులతో పవన్ ఈ సినిమాలో కలిసి పనిచేయడమే ఆయన ఆలోచనా విధానానికి నిదర్శనం. అభిమానులు కేవలం పొలిటికల్ పంచ్‌ల కోసమే థియేటర్లకు వచ్చి నిరాశ చెందకూడదనే ఉద్దేశ్యంతోనే.. అంచనాలను బ్యాలెన్స్ చేయడానికి, అలాగే విడుదలకు ముందు అనవసర వివాదాలకు తావివ్వకుండా ఉండటానికి హరీష్ శంకర్ ఈ విషయాన్ని ముందుగానే క్లారిటీ ఇచ్చారు.

అంతా బాగానే ఉన్నా.. పొలిటికల్ రిఫరెన్స్‌లు లేకపోతే రాజకీయంగా పవన్ సినిమా ఎలాంటి ఇంపాక్ట్ చూపుతుంది? అనే ప్రశ్న అందరిలోనూ మెదులుతోంది. వాస్తవానికి ఒక వర్గాన్ని టార్గెట్ చేసే డైలాగ్స్ లేకపోవడం వల్ల సినిమా రీచ్ మరింత పెరుగుతుంది. పవన్ కళ్యాణ్‌కు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల్లోనూ, వర్గాల్లోనూ అభిమానులు ఉన్నారు. సినిమాను పూర్తిగా పాలిటిక్స్‌కు దూరంగా ఉంచడం వల్ల, సగటు ప్రేక్షకుడు ఎలాంటి పక్షపాతం లేకుండా స్వచ్ఛమైన సినిమాను ఎంజాయ్ చేయగలుగుతారు. పవన్ కళ్యాణ్ మాస్ అప్పీల్‌ను, ఆయన ఆరాను ఇది మరింత పెంచుతుంది. పొలిటికల్ అంశాలు, సెటైర్లు లేకుండా ఉస్తాద్ నిలబడతాడా? అంటే కచ్చితంగా నిలబడతాడనే సమాధానమే వినిపిస్తోంది. గతంలో వీళ్ళిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ఇండస్ట్రీ హిట్ గబ్బర్ సింగ్ కేవలం వినోదం, పవన్ కళ్యాణ్ స్వాగ్, మేనరిజమ్స్ పైనే ఆధారపడి సంచలనం సృష్టించింది. ఉస్తాద్ భగత్ సింగ్‌లో కూడా పొలిటికల్ పంచ్‌లు లేకపోయినా.. పవన్ మార్క్ కామెడీ, హై-వోల్టేజ్ యాక్షన్, దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్, అన్నింటికీ మించి ఫ్యాన్స్‌కి కావాల్సిన హీరో ఎలివేషన్స్ పుష్కలంగా ఉంటాయని డైరెక్టర్ హామీ ఇస్తున్నారు. రోజుకు 18 గంటల పాటు కష్టపడి పవన్ ఈ సినిమా కోసం పనిచేశారు కాబట్టి, ఆయన ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్ పక్కా కమర్షియల్ మీల్స్ లాగా వర్కౌట్ అవుతాయి. మొత్తమ్మీద చూసుకుంటే.. 'ఉస్తాద్ భగత్ సింగ్' ఒక రాజకీయ అస్త్రంలా కాకుండా.. అభిమానులకు సగటు, అలాగే ప్రేక్షకులకు ఒక పూర్తి స్థాయి విందు భోజనంలా రాబోతోంది. రాజకీయాలకు, సినిమాకు మధ్య స్పష్టమైన గీత గీయడం పవన్ కళ్యాణ్ మెచ్యూరిటీని సూచిస్తుంది. కేవలం ఎలివేషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్ మాత్రమే నమ్ముకుని బరిలోకి దిగుతున్న ఈ చిత్రం.. కంటెంట్ బలంగా ఉంటే పొలిటికల్ వివాదాలతో పనిలేకుండానే బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటగలదు. మార్చి 26న విడుదల కానుంది ఈ చిత్రం.





## వెల్లుల్లి టీతో ఎన్ని లాభాలో..

గుండె ఆరోగ్యం నుంచి బరువు తగ్గడం వరకు, రోగనిరోధక శక్తిని పెంచడం నుంచి కొలెస్ట్రాల్ తగ్గించడం వరకు వెల్లుల్లి టీ చేసే మేలు అంతా ఇంతా కాదు. వందల రూపాయల మాత్రల కంటే, వంటగదిలో అతి తక్కువ ధరకు దొరికే వెల్లుల్లి మన శరీరానికి ఎక్కువ రక్షణ కల్పిస్తుంది. మరి ఈ అద్భుతమైన టీని ఎలా తయారు చేయాలి? ఎవరు తాగకూడదో ఇప్పుడు సవివరంగా తెలుసుకుందాం. వెల్లుల్లి టీ వల్ల కలిగే ప్రయోజనాలు:

గుండెకు రక్ష: వెల్లుల్లి టీ రక్తంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, రక్త నాళాల్లోని అడ్డంకులను తొలగిస్తుంది. ఇది రక్తపోటును నియంత్రిస్తూ గుండెపోటు ముప్పును తగ్గిస్తుంది.

రోగనిరోధక శక్తి: వెల్లుల్లిలోని అల్లిసిన్ బ్యాక్టీరియా వైరస్‌లను నాశనం చేస్తుంది. జలుబు, దగ్గు, శ్లేష్మం వంటి సమస్యలతో బాధపడేవారికి ఇది గొప్ప ఉపశమనం.

బరువు తగ్గడం: ఇది శరీర జీవక్రియను వేగవంతం చేసి, అవాంఛిత కొవ్వును కరిగించడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచి గ్యాస్ సమస్యలను దూరం చేస్తుంది.

వెల్లుల్లి టీ తయారీ విధానం

వెల్లుల్లిని మరీ ఎక్కువగా మరిగిస్తే అందులోని ఔషధ గుణాలు నశిస్తాయి. కాబట్టి ఈ పద్ధతి పాటించండి:

2 లేదా 3 వెల్లుల్లి రెబ్బలను తీసుకుని పొట్టు తీసి బాగా నలపాలి.

నలిపిన వెల్లుల్లిని 10 నిమిషాల పాటు గాలిలో ఉంచాలి (అప్పుడే అల్లిసిన్ విడుదలవుతుంది).

ఒక గ్లాసు నీటిని మరిగించి, స్టవ్ ఆపివేసి, అందులో ఈ వెల్లుల్లి వేసి 5 నిమిషాలు మూత పెట్టి ఉంచాలి.

ఆ తర్వాత వడకట్టి, కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి తాగాలి.

ఎవరు తాగకూడదు?

రోజుకు ఒక కప్పు వెల్లుల్లి టీ సరిపోతుంది. అతిగా తాగితే గుండెల్లో మంట లేదా కడుపులో అల్సర్ వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా తీవ్రమైన అల్సర్ ఉన్నవారు, శస్త్రచికిత్స జరగబోయే వారు, మరియు రక్తాన్ని పలుచబరిచే మందులు వాడేవారు వైద్యుడిని సంప్రదించిన తర్వాతే దీనిని తీసుకోవాలి.

గమనిక: ఇది కేవలం సమాచారం మాత్రమే. సంస్థ దీనికి బాధ్యత వహించదు. ఏదైనా కొత్త ఆరోగ్య అలవాటును ప్రారంభించే ముందు మీ వైద్యుడిని సంప్రదించడం మంచిది.



## కివీ పండు తొక్క తీసి పారేస్తున్నారా?.

విటమిన్ సి అధికంగా ఉండే పండల్లో కివి ముందు వరుసలో ఉంటుంది. అంతటి పోషకాలున్న ఈ పండు గుజ్జులోనే కాదు పై పొరలో కూడా ఎన్నో ప్రయోజనాలున్నాయట. కివీ తొక్క తినడం వల్ల కలిగే అద్భుత ప్రయోజనాలు ఏంటి? ఆ పైన ఉండే పీచు ఇబ్బంది లేకుండా ఎలా తినాలో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

1. జీర్ణక్రియకు ప్రాణం:

కివీ తొక్కలో ఉండే అధిక పీచు పదార్థం పేగుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది మలబద్ధకాన్ని వదిలించడమే కాకుండా, రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక బెస్ట్ ఆప్షన్.

2. రోగనిరోధక శక్తి పెంపు:

కివీ తొక్కలో విటమిన్ సి ఇ సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి సహజమైన రక్షణ కవచంలా పనిచేస్తాయి. ఇందులోని యాంటీ మైక్రోబియల్ గుణాలు హానికర బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని కాపాడతాయి.

3. మెరిసే చర్మం:

వృద్ధాప్య ఛాయలను తగ్గించడంలో కివీ తొక్క అద్భుతంగా పనిచేస్తుంది. విటమిన్ ఇ చర్మం పొడిబారకుండా చూస్తుంది. కొంతమంది సహజ సౌందర్యం కోసం దీనిని ఫేస్ స్క్రబ్‌లలో కూడా ఉపయోగిస్తారు.

4. వ్యాధుల నుండి రక్షణ:

ఇందులోని ఫ్లేవనాయిడ్స్ శరీరంలో వాపును తగ్గిస్తాయి. గుండె జబ్బులు, మధుమేహం క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల ముప్పును తగ్గించడంలో కివీ తొక్క సహాయపడుతుంది.

5. పర్యావరణానికి మేలు:

పండును పూర్తిగా తొక్కతో సహా తినడం వల్ల ఆహార వృధాను తగ్గించవచ్చు. ఇది పర్యావరణానికి మనం చేసే చిన్న సహాయం.

కివీ తొక్కపై ఉండే పీచు పోవాలంటే ఏం చేయాలి?

చాలామంది కివీ పైన ఉండే పీచు చూసి తినడానికి ఇష్టపడరు. కానీ దీన్ని సులభంగా తొలగించవచ్చు:

క్లీనింగ్: పండును తినేముందు వెజిటబుల్ బ్రష్ లేదా గరుకుగా ఉండే గుడ్డతో మెల్లగా రుద్ది కడిగితే పీచు పోతుంది.

గోల్డెన్ కివీ: సాధారణ కివీ కంటే 'గోల్డెన్ కివీ' తొక్క పలచగా ఉంటుంది మరియు పీచు తక్కువగా ఉంటుంది.

స్మూతీస్: కివీని తొక్కతో సహా ముక్కలుగా కోసి స్మూతీస్‌లో బ్లెండ్ చేస్తే పీచు అసలు తెలియదు.

## వరల్డ్ కప్ నుంచి భారత్ అవుట్?

టీ20 వరల్డ్ కప్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగిన టీమిండియా ఇప్పుడు ఇంటిదారి పట్టే పరిస్థితిలో ఉంది. పాయింట్ల పట్టికను చూస్తే, భారత్ ఉన్న గ్రూప్ నుంచి వెస్టిండీస్, సౌతాఫ్రికా జట్లు సెమీఫైనల్‌కు దూసుకెళ్లడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. అసలు వరల్డ్ ఛాంపియన్ అని పిలుచుకునే మన జట్టుకు ఈ దుస్థితి ఎందుకు వచ్చింది? ఎవరు దీనికి బాధ్యులు? ప్రధానంగా ముగ్గురు ఆటగాళ్ల పేలవ ప్రదర్శనే భారత జట్టును ఈ క్లిష్ట స్థితిలోకి నెట్టిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆ ముగ్గురు విలన్లు ఎవరో చూద్దాం. మొదటి పేరు అభిషేక్ శర్మ. భారత జట్టుకు బలమైన ఆరంభాన్ని ఇవ్వాల్సిన బాధ్యత కలిగిన ఈ ఓపెనర్, ఈ వరల్డ్ కప్‌లో ఘోరంగా విఫలమయ్యాడు. నాలుగు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఆయన చేసిన పరుగులు కేవలం 15 మాత్రమే. ఇందులో వరుసగా మూడు సార్లు డకౌట్ (సున్నాకే అవుట్) అయ్యి హాట్రిక్ నమోదు చేయడం గమనార్హం. ఓపెనర్ సరైన పునాది వేయకపోవడంతో మిగిలిన బ్యాటర్లు ఒత్తిడికి లోనయ్యారు. జట్టు స్కోరును కనీసం ముందుకు తీసుకెళ్లలేక అభిషేక్ చతికిలపడటం టీమ్ ఇండియా కొంపముంచింది. రెండో ఆటగాడు తిలక్ వర్మ. 2025 ఆసియా కప్ ఫైనల్లో అద్భుతమైన ఇన్నింగ్స్‌తో భారత్‌ను గెలిపించిన హీరో, ఇప్పుడు జీరోగా మారాడు. ఈ వరల్డ్ కప్‌లో ఐదు ఇన్నింగ్స్‌ల్లో కలిపి కేవలం 107 పరుగులు మాత్రమే చేశాడు. స్ట్రైక్ రేట్ 119 మాత్రమే ఉండటం, కనీసం ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయకపోవడం తిలక్ వైఫల్యానికి నిదర్శనం. సగటు కేవలం 21.40 వద్దే ఆగిపోయింది. అభిషేక్ విఫలమైనప్పుడు మిడిల్ ఆర్డర్‌లో తిలక్ ఆదుకుంటాడని మేనేజ్మెంట్ ఆశించినా, ఆయన ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోయాడు. ఇక మూడో వ్యక్తి వాషింగ్టన్ సుందర్. గాయం నుంచి కోలుకున్న తర్వాత నేరుగా సూపర్-8 వంటి కీలక మ్యాచ్‌లో సుందర్‌కు అవకాశం ఇచ్చారు. వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్‌ను కాదని మరీ సుందర్‌ను తీసుకున్న మేనేజ్మెంట్ నమ్మకాన్ని ఆయన వమ్ము చేశాడు. ఐదో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చి కేవలం 11 పరుగులు మాత్రమే చేశాడు. ఇక బౌలింగ్‌లోనైనా మ్యాజిక్ చేస్తాడనుకుంటే ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. ఇలా కీలక ఆటగాళ్లు చేతులెత్తేయడంతో టీమిండియా సెమీస్ రేసులో వెనుకబడిపోయింది.



## సూర్యసేన సెమీస్ చేరాలంటే ఏం జరగాలి? రన్ రేట్ లెక్కలు ఇవే

టీ20 వరల్డ్ కప్ 2026 ఇప్పుడు ఒక క్లైమాక్స్ సినిమాను తలపిస్తోంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన టీమిండియా ప్రతి మ్యాచ్ చావో రేవో అన్నట్లుగా మారింది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు సెమీఫైనల్ చేరాలంటే కేవలం గెలిస్తే సరిపోదు.. అదృష్టం కూడా తోడవ్వాలి. ముఖ్యంగా సౌతాఫ్రికా చేతిలో ఎదురైన 76 పరుగుల ఘోర పరాజయం భారత్ నెట్ రన్ రేట్‌ను మైనస్ (-3.800)కి పడదోసింది. ఇప్పుడు మన జట్టు గండం గట్టెక్కాలంటే జింబాబ్వేపై జరగబోయే మ్యాచ్‌లో మామూలు విజయం సరిపోదు, ఒక భారీ విధ్వంసం సృష్టించాల్సిందే. జింబాబ్వేను చిత్తుగా ఓడించి రన్ రేట్‌ను పెంచుకుంటేనే, ఆ తర్వాత వెస్టిండీస్‌తో జరిగే పోరులో మనకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో వెస్టిండీస్ ౦5.350 రన్ రేట్‌తో అగ్రస్థానంలో ఉంటే, సౌతాఫ్రికా ౦3.800 తో రెండో స్థానంలో ఉంది. భారత్ మూడో స్థానంలో పడిపోయింది. ఫిబ్రవరి 26న జింబాబ్వేతో జరగబోయే మ్యాచ్‌లో భారత్ ఎంత భారీగా గెలవాలో ఒకసారి లెక్కలు వేసి చూద్దాం. ఒకవేళ భారత్ మొదట బ్యాటింగ్ చేసి 220 పరుగులు చేస్తే.. జింబాబ్వేను కనీసం 120 పరుగుల లోపే కట్టడి చేయాలి. అంటే 100 పరుగుల కంటే ఎక్కువ తేడాతో గెలిస్తేనే రన్ రేట్ గణనీయంగా మెరుగుపడుతుంది. అలా కాకుండా జింబాబ్వే మొదట బ్యాటింగ్ చేసి 150-160 పరుగులు చేస్తే, భారత్ ఆ లక్ష్యాన్ని కేవలం 11 లేదా 12 ఓవర్లలోనే ఫినిష్ చేయాలి. అప్పుడే మన రన్ రేట్ పాజిటివ్‌లోకి వచ్చి పటిష్టంగా మారుతుంది.

అయితే ఈ లెక్కలు వేయడం సులభమే కానీ, మైదానంలో అమలు చేయడం కష్టం. ఎందుకంటే ఈ వరల్డ్ కప్‌లో జింబాబ్వే మామూలు ఫామ్‌లో లేదు. లీగ్ స్టేజ్‌లోనే ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి దిగ్గజ జట్లనే ఓడించి సెన్సేషన్ క్రియేట్ చేసింది. కాబట్టి వాళ్లను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. భారత్ సెమీస్ చేరడానికి ఉన్న మెయిన్ ఈక్వేషన్స్ ఒకసారి పరిశీలిస్తే పరిస్థితి ఎంత సంక్లిష్టంగా ఉందో అర్థమవుతుంది. సెమీఫైనల్ ఈక్వేషన్ -- 1 (సౌతాఫ్రికా సాయం చేస్తే)

ఒకవేళ టీమిండియా తన మిగిలిన రెండు మ్యాచుల్లో (జింబాబ్వే, వెస్టిండీస్) గెలిస్తే భారత్ ఖాతాలో 4 పాయింట్లు చేరుతాయి. అదే సమయంలో సౌతాఫ్రికా జట్టు వెస్టిండీస్‌ను ఓడించాలి. అప్పుడు వెస్టిండీస్ 2 పాయింట్లతోనే ఆగిపోతుంది. ఫలితంగా భారత్, సౌతాఫ్రికా నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఇక్కడ నెట్ రన్ రేట్‌తో పెద్దగా ఇబ్బంది ఉండదు.

సెమీఫైనల్ ఈక్వేషన్ - 2 (వెస్టిండీస్ గెలిస్తే)

ఒకవేళ వెస్టిండీస్ జట్టు సౌతాఫ్రికాను ఓడించిందనుకోండి.. అప్పుడు పరిస్థితి మరింత జటిలం అవుతుంది. అప్పుడు భారత్ తన రెండు మ్యాచులను భారీ తేడాతో గెలవాల్సి ఉంటుంది. ముఖ్యంగా జింబాబ్వేపై 100 పరుగుల తేడాతో గెలిచి, వెస్టిండీస్‌ను కూడా ఓడిస్తే.. అప్పుడు భారత్, వెస్టిండీస్ చెరో 4 పాయింట్లతో నిలుస్తాయి. అప్పుడు ఎవరి రన్ రేట్ ఎక్కువగా ఉంటే వాళ్లే సెమీస్ వెళ్తారు.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com